క్లుప్తంగా

గెజిటెడ్ సంతకాల నిలుపుదలపై ఆవేదన

సామర్లకోట: మండల పరిధిలోని మాధవపట్నంలో పశువైద్యాధికారి గెజిటెడ్ సంతకాలు చేయనంటూ బోర్డు ఏర్పాటు చేయడంపై ఆ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాధవపట్నంలో పశువైద్యాధికారి సంతకం చేయకపోతే గెజిటెడ్ సంతకాలు అవసరమైనవారంతా 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న సామర్లకోట వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. పశువైద్యాధికారి గెజిటెడ్ సంతకాలు చేయనంటూ ప్రకటించడం సరికాదని మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం అన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ


ఉండూరులో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: మండల పరిధిలో వీకే రాయపురం, ఉండూరు గ్రామాల్లోని ఎలిమెంటరీ పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య సోమవారం తనిఖీ చేశారు. ఈ మేరకు విద్యార్థుల వర్క్ బుక్‌లతో పాటు డైరీలు, టీచర్ల డైరీలు, రికార్డులను తనిఖీ చేశారు. నాడు–నేడు పథకంలో జరుగుతున్న పనులను, పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అన్న సమారాధన

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరిలో వేంచేసియున్న శ్రీ బాల కనకదుర్గా దేవి ఆలయం వద్ద సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కానుకలతో ఈ అన్న సమారాధన నిర్వహిస్తున్నామన్నారు. పెళ్లి భోజనాలను తలపించే విధంగా వివిధ రకాల వంటకాలతో సమారాధనను నిర్వహించారు. సుమారు 3 వేల మంది భక్తులు గోర్స, వెంకటరాయపురం, చిన కలవలదొడ్డి గ్రామాల నుంచి విచ్చేసి అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

15న మున్సిపల్ ప్రత్యేక సమావేశం

సామర్లకోట: ఈనెల 15వ తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో 2022–23 సవరణ బడ్జెట్, 2023–24 అంచనా బడ్జెట్‌లపై చర్చ ఉంటుందన్నారు. సమావేశానికి అధికార, ప్రతిపక్ష సభ్యులు హాజరు కావాలని కోరారు.

రేషన్ షాపుల తనిఖీ


సామర్లకోటలోని 19వ నంబరు రేషన్ షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

సామర్లకోట: పట్టణ పరిధిలోని రేషన్ షాపుల్లో సరకులు పక్కదారి పడుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో సోమవారం సాయంత్రం సివిల్ సప్లయ్ అధికారులు 7, 19వ నెంబర్ల రేషన్ షాపులను తనిఖీ చేశారు. రేషన్ షాపులకు వచ్చిన స్టాక్, ప్రజలకు సరఫరా అయిన స్టాక్ వివరాల రికార్డులను పరిశీలించి కొంత మేర వ్యత్యాసాలున్నాయని గుర్తించారు. విషయాన్ని జేసీ దృష్టిలో ఉంచి ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఎంఎస్‌ఓ లక్ష్మీరమణి, ఏఎస్‌ఓ టి.ప్రసన్నలక్ష్మిలు తెలిపారు. తనిఖీల్లో వీఆర్వోలు ఎ.సత్యనారాయణ, ఎం.బుజ్జిబాబులు పాల్గొన్నారు.

కుక్కుటేశ్వరస్వామికి నూతన హంస వాహనం


భక్తులు సమర్పించిన హంస వాహనం

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో వేంచేసియున్న కుక్కుటేశ్వరస్వామికి భక్తులు నూతన హంస వాహనాన్ని సమకూర్చినట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాస్ తెలిపారు. పిఠాపురం మండలం మల్లాంకు చెందిన వెన్నపు చక్రధరరావు దంపతులు ఈ వాహనాన్ని ఆలయానికి బహూకరించినట్లు ఆయన తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో స్వామివారు నూతన హంస వాహనంపై పాదగయ పుష్కరిణిలో విహరించనున్నారు.

జోరుగా అక్రమ లే అవుట్లు


మూలపేటలో అనుమతి లేకుండా వేస్తున్న లే అవుట్

- నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్లుగా మారుతున్న పంట పొలాలు
- ఏమాత్రం పట్టించుకోని అధికారులు

కొత్తపల్లి: ప్రజల అవసరాలకు ఆసరాగా తీసుకుని అక్రమ లే అవుట్లు జోరుగా వెలుస్తున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి పంట పొలాలను ఇళ్ల స్థలాలుగా విక్రయిస్తున్నారు. మండల పరిధిలో ఇటీవల అక్రమ లే అవుట్ల వ్యాపారం గట్టిగా సాగుతోంది. మండల శివారు ప్రాంతాల్లోని పంట పొలాలను ఇళ్ల స్థలాలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండానే వ్యాపారాలు సాగిస్తున్నారు. మూలపేట, గోర్స, కొండెవరం, రమణక్కపేట, కొత్తపల్లి, అమీనాబాద్, ఉప్పాడ పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు లే అవుట్లను వేశారు. పంట పొలాలను కొనుగోలు చేసి ప్లాట్లుగా ఏర్పాటు చేశారు. కనీస అనుమతులు లేకుండా వీటిని గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. వాస్తవానికి వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి తదనంతరం అధికారులు అనుమతులు పొందాల్సి ఉంది. అంతేకాకుండా ప్లానింగ్ అధికారులు లే అవుట్‌ను అప్రూవ్ చేయాలి. నిబంధనలను అనుసరించి 30 నుంచి 40 అడుగుల వెడల్పుగల రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ సదుపాయం, మంచినీటి సౌకర్యం కల్పించాలి. దీంతోపాటు మొత్తం లే అవుట్ స్థలంలో 10 శాతం కమ్యూనిటీ సైట్‌గా కేటాయించాలి. కానీ ఇవేమీ పట్టించుకోకుండా రియల్టర్లు ఇష్టారాజ్యంగా లే అవుట్లు వేస్తున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో చూసి చూడనట్లు వ్యవహరించడంపై పలువురు విమర్శిస్తున్నారు. కాగా ప్రభుత్వానికి ఎటువంటి చెల్లింపులు లేకుండానే పంట భూములను ఇళ్ల స్థలాలుగా మార్చేసి రోజుల వ్యవధిలోనే విక్రయిస్తున్న అక్రమార్కులపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతోంది.

అనుమతులు లేకపోతే చర్యలు



పంచాయతీ అనుమతులు లేకుండా లే అవుట్ వేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం. అనుమతి లేని లే అవుట్ యజమానులకు పంచాయతీ సిబ్బంది నోటీసులను జారీ చేయాలి. అక్కడ బోర్డులను ఏర్పాటు చేయాలి. ఇటువంటి అనుమతులు లేని లే అవుట్‌లలో స్థలాలు కొన్నవారు ఇళ్ల నిర్మాణం కోసం అదనంగా పంచాయతీలకు రుసుం చెల్లించాల్సి వస్తుంది. పంచాయతీ ద్వారా ఎటువంటి సౌకర్యాలు కల్పించరు. స్థలాలు కొనుగోలు చేసేవారు అన్ని అనుమతులను పరిశీలించుకోవాలి.

– ఎం.ఎస్.భాస్కరరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ, కొత్తపల్లి

మహాశివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు

- ఆర్డీవో వెంకటరమణ


మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఆర్డీవో రమణ

కాకినాడ సిటీ: మహా శివరాత్రి ఉత్సవాలను భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆర్డీవో బి.వెంకటరమణ కోరారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని సామర్లకోట శ్రీచాళుక్య కుమారా రామ భీమేశ్వరస్వామి, పిఠాపురం శ్రీకుక్కుటేశ్వరస్వామి ఆలయా(పాదగయ క్షేత్రం)లలో జరిగే ఉత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 21 వరకూ జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, బారికేడ్ల ఏర్పాటు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య పనులను ప్రాధాన్యంతో నిర్వహించాలని భక్తుల రద్దీకి తగ్గట్టుగా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. తాగునీరు ప్రథమ చికిత్స శిబిరాలు, కోనేరు వద్ద రక్షణ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆలయాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ట్రాఫిక్ నియంత్రణకు తగిన ఏర్పాట్లు చేపడతామన్నారు. దేవదాయ, మున్సిపల్, విద్యుత్, ఇరిగేషన్, ఫిషరీస్, వైద్య, ఆరోగ్యశాఖ, కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

స్పందనకు 12 అర్జీలు

పెద్దాపురం: వారం వారం నిర్వహించే స్పందనలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి 12 అర్జీలు అందినట్లు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. స్పందనలో భూసర్వే చేయాలని, ఆక్రమణకు గురైన స్థలాలను కాపాడాలని, పట్టాదారు పాస్‌బుక్‌లో పేర్లు మార్చాలని, రోడ్డు మరమ్మతుల పనులు చేపట్టాలని తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి, డీటీ భాను కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యంగా చేయాలి


అమీనాబాదులో సీసీ డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సంధ్య

కొత్తపల్లి: గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులను నాణ్యతగా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సంధ్య అన్నారు. మండలంలోని అమీనాబాదులో గడపగడపకూ మన ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో నిర్మిస్తున్న సీసీ డ్రైన్ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రధాన సీసీ డ్రైన్ రూ.20లక్షలతో చేపట్టామన్నారు. ఈ డ్రైన్ నిర్మాణంతో గ్రామంలోని మురుగునీటి సమస్య పూర్తిగా నివారించవచ్చన్నారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. చేపట్టే పనులను అధికారుల పర్యవేక్షణలో చేయాలని ఆమె సూచించారు. నాణ్యతలో ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ


సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామి వారు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరీ సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మాఘమాసం, స్వామి వారికి ప్రీతిపాత్రమైన సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారుజామున స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. పూజల అనంతరం స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈఓ డి.నాగ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం నుంచి అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

శతాబ్ది పార్క్ అభివృద్ధికి చర్యలు


పార్క్ అభివృద్ధి పనులపై సూచనలిస్తున్న వైస్ చైర్మన్ సాయిప్రసాద్

పెద్దాపురం: పట్టణ పరిధిలోని శతాబ్ది పార్క్ అభివృద్ధికి చర్యలు చేపడతామని పెద్దాపురం మున్సిపాల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన మున్సిపాల్ అధికారులు, కౌన్సిలర్లతో కలిసి పార్క్‌ను పరిశీలించారు. శతాబ్ది ట్రైన్ ఎక్కి పార్క్ స్థితిగతులను పరిశీలించి, పార్క్ అభివృద్ధి పనులపై అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ మాట్లాడుతూ పార్క్ అభివృద్ధి కుంటుపడడంతో దాని నిర్వహణ బాధ్యతలు మున్సిపాలిటీ చేపట్టవలసిన అవసరం వచ్చిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎ.వీరరాఘవులు, పప్పుల దుర్గారావు, వైఎస్సార్ సీపీ నాయకులు చింత శ్రీనివాసరావు, బొడ్డు ప్రకాష్, టీపీఓ ఉమా మహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ రోడ్డులో టిప్పర్ బోల్తా


కాకినాడ కెనాల్ రోడ్డులో బోల్తాపడిన టిప్పర్‌ను క్రేన్‌తో పక్కకు తీస్తున్న దృశ్యం

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో గోదావరి కాలువ ఇనుప కాలిబాట వంతెన, రైల్వే గేటు మధ్య రోడ్డులో సోమవారం గ్రావెల్ టిప్పర్ అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాఫిక్ ఎస్‌ఐ అడపా గరగారావు, ఏఎస్‌ఐ రత్నంలు తన సిబ్బందితో హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రెండు క్రేన్‌ల సహాయంతో బోల్తా పడిన టిప్పర్‌ను రోడ్డు పైనుంచి పక్కకు తీశారు. టిప్పర్‌ను పక్కకు తొలగించే పనుల్లో జాప్యం జరగడంతో భారీగా వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. వాహనాల రద్దీ తక్కువ ఉండే సమయంలో ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్యలో టిప్పర్ తీసుంటే బాగుండేదని ఉద్యోగులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

పొలిటికల్ పవర్ సాధనే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ స్వరూప్

పిఠాపురం: పొలిటికల్ పవర్ ఉంటేనే దళితులకు విముక్తి లభిస్తుందని అది సాధించడమే లక్ష్యంగా పని చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వి.కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. అంబేడ్కర్ సందేశ్ యాత్రలో భాగంగా రాజ్యాధికార సాధన చైతన్య సభను సోమవారం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని బావనరావు సభా సదన్‌లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దళితుల రాజ్యాంగ హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. సామాజిక న్యాయం కోసం అణగారిన కులాల ఐక్యతతో రాజ్యాధికారం సాధించుకోవాలని పిలుపునిచ్చారు. రాజాల నాగేశ్వరరావు, దాసరి అన్నపూర్ణ, సాకా రాధాకృష్ణ, ఆర్.నాగబాబు, దర్శి అయ్యారావు, చిట్టుమూరి గోవింద్ పాల్గొన్నారు.

సభ్యత్వాలను వేగంగా పూర్తి చేయాలి

సామర్లకోట: జనసేన సభ్యత్వాలను వేగంగా పూర్తి చేయాలని జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక గాంధీచౌక్‌లోని రైతు భవనంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు ప్రమాద బీమా ఉంటుందన్నారు. జనసేన పార్టీ నుంచి ప్రజలకు మంచి జరుగుతుందని చెప్పారు. కార్యక్రమానికి నియోజకవర్గ కన్వీనర్ తుమ్మల బాబు, పార్టీ నాయకులు బండారు శ్రీనివాసు, శెట్టిబత్తుల రాజబాబు, మేడ గురుదత్తు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శం వారి ప్రేమ వివాహం

- భర్త వీరబాబుకు అండగా నిలబడిన సత్య
- నేడు ప్రేమికుల దినోత్సవం

పెద్దాపురం: రెండక్షరాల ప్రేమ.. రెండు హృదయాల్ని దగ్గర చేస్తుంది. ఆ ప్రేమ జంటతో ఏడడుగులు వేయిస్తుంది. మూడుముళ్ల బంధంలోకి అడుగు పెట్టిస్తుంది. అలా ఒక్కటైన ప్రేమికులు ఒకరినొకరు గౌరవించుకుంటూ అదే ప్రేమతో జీవితాన్ని కొనసాగిస్తే వారికి మధురానుభూతుల్ని మిగులుస్తుంది. నిజమైన ప్రేమ ఎదుటివారిలో లోపాల్ని వెతక్కుండా వారికి అన్నివేళలా అండగా నిలుస్తుంది. అలాంటి ప్రేమికులే పెద్దాపురానికి చెందిన వీరబాబు, సత్యలు. వికలాంగుడైన తన భర్త వీరబాబుకు అండగా నిలబడి ప్రేమికులందరికీ ఆదర్శంగా నిలిచిందామె. ఇరవై ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్న వీరబాబు, సత్యలిద్దరూ జీవితంలో ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా ఒకరికొకరు తోడుగా నిలబడి ముందడుగేశారు. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వారి ప్రేమ కథేంటో మనమూ చూద్దాం పదండి...

పెద్దాపురం మండలం తిరుపతి గ్రామానికి చెందిన రాయవరపు వీరబాబు దివ్యాంగుడైనా ఎన్నో కష్టాల కోర్చి మండల కేంద్రమైన పెద్దాపురంలో ఓ కంప్యూటర్ సెంటర్ నడిపేవాడు. అదే పట్టణానికి చెందిన సత్య ఆ కంప్యూటర్ సెంటర్‌లో పరిచయమైంది. ఆ పరిచయం కాస్త ప్రేమకు దారితీసింది. పెద్దల సహకారం లేకపోయినా 2002లో అంగవైకల్యంతో ఉన్న వీరబాబును సత్య ఆదర్శ వివాహం చేసుకుని అండగా నిలబడింది. వారికి ఇద్దరు కుమారులు. సుమారు 20 ఏళ్ళ దాంపత్య జీవితంలో వారిరువురి మధ్య ఉన్న ప్రేమబంధం ఇరు కుటుంబాలను తిరిగి కలిపింది. తమ ఇద్దరు పిల్లలను బాగా చదివించుకోవడమే కాకుండా సుమారు 100 మంది దివ్యాంగ పిల్లలను చేరదీసి దాతల సహకారంతో పులిమేరులో శాంతివర్ధన మానసిక వికలాంగుల పాఠశాలను నడుపుతూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఇన్నేళ్ల ప్రయాణంలో ఎన్ని కష్టాలెదురైనా ఇద్దరూ ఒకరికొకరు తోడుగా నిలబడి ముందుకు అడుగేశారంటే అది ప్రేమ గొప్పతనమేనని వీరబాబు, సత్యలు చెబుతున్నారు.


ఆదర్శ వివాహం చేసుకున్న వీరబాబు, సత్య దంపతులు

రైల్వే గేటు వద్ద పనులు ప్రారంభం


పీబీ దేవం రైల్వే గేటు వద్ద ట్రాకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సామర్లకోట: మండల పరిధిలోని పీబీ దేవం రైల్వే గేటు వద్ద ట్రాకు మరమ్మతుల పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇటీవల కాలంలో వేగంగా నడిచే రైళ్ల రాకపోకలు పెరగడంతో విజయవాడ నుంచి విశాఖపట్నం వరకూ రైల్వే ట్రాకు మరమ్మతులు చేస్తున్నట్లు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు దాసరి సాయిశంకర్ తెలిపారు. దీంట్లో భాగంగా సామర్లకోట రైల్వే స్టేషన్ పరిధిలో పిఠాపురం నుంచి అనపర్తి వరకు పట్టాల దిగువ భాగంలో ఉన్న రాళ్లను, కమ్మెలను మారుస్తున్నామని చెప్పారు. బుధవారం సాయంత్రానికి పనులు పూర్తవుతాయన్నారు. రైల్వే గేటు మూసేయడంతో పీబీ దేవం మీదుగా రాకపోకలు సాగించే బస్సులన్నీ గ్రామంలోనే నిలిపేలా చూడాలని కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజరుకు లేఖ రాశామని పంచాయతీ కార్యదర్శి రామ్‌నాథ్ విలేకర్లకు తెలిపారు. గ్రామ ప్రజలు పట్టాలు దాటి రాకపోకలు సాగించే సమయంలో రైళ్లను గమనించుకొవాలని పంచాయతీ నుంచి హెచ్చరికలు జారీ చేస్తున్నామని చెప్పారు. గేటు మూసేయడంతో గ్రామ శివారులో ఉన్న రైల్వే కాను నుంచి సైకిళ్లు, మోటారు సైకిళ్ల రాకపోకలు పెరిగాయి.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

- వ్యవసాయ శాఖ కమిషనరేట్ ప్రత్యేకాధికారి కృష్ణదాస్

పెద్దాపురం: ప్రతి రైతు ఈ–క్రాప్ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ కమిషనరేట్ ప్రత్యేకాధికారి, జేడీఏ విడివి కృష్ణదాస్ అన్నారు. తాటిపర్తి గ్రామంలో సోమవారం ఈ–పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన జిల్లా డీఏఓ కార్యాలయ టీఏ పద్మజారాణి, వ్యవసాయశాఖాధికారి సంజయ్‌కుమార్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ ఈ–క్రాప్ ఆధారంగానే భవిష్యత్‌లో పంటల కొనుగోలు, మద్దతు ధర, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా వర్తిస్తాయని చెప్పారు. స్థానికంగా పండించే పంటలు, పంట రకాలు, సర్వే నెంబర్లు, విస్తీర్ణం, జలాధారం వంటి అంశాలపై రైతులు, వ్యవసాయ శాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు గోపు సత్యనారాయణ, గాదె వెంకట కృష్ణ తదితరులున్నారు.

మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి


పంచాయతీ కార్యాలయం వద్ద మొక్కలను నాటుతున్న సిబ్బంది

కొత్తపల్లి: ప్రతీ ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సర్పంచ్ నక్క మణికంఠబాబు అన్నారు. ఇంటింటికీ మొక్కల పంపిణీలో కార్యక్రమంలో భాగంగా మండలంలోని అమీనాబాద్ గ్రామ సచివాలయం వద్ద సోమవారం మొక్కల పంపిణీ నిర్వహించారు. పంచాయతీ పరిధిలో ఉన్న ప్రధాన రహదారుల్లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన మొక్కలను పర్యవేక్షించే బాధ్యత తమపై ఉందన్నారు. మొక్కలకు రక్షణ కల్పించే విధంగా కంచెలను ఏర్పాటు చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అధికారులు పాల్గొన్నారు.